క్లుప్తంగా

నిరుపేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న వైస్ ఎంపీపీ అప్పలరాజు

పరవాడ: నిరుపేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు అన్నారు. వాడచీపురుపల్లిలో బుధవారం జగనన్న ఇళ్లకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలను ఆయన అందజేశారు. తమ సొంతింటి కలను నిజం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటామని మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారని అప్పలరాజు చెప్పారు. ఈకార్యక్రమంలో లంకెలపాలెం పీఏసీఎస్ చైర్మన్ బురద రాజు, ఎంపీటీసీ పుష్పాచంద్రారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం. అప్పారావు, కన్వీనర్ కూండ్రపు ఉమామహేశ్వరి, కె.తాతాజీ, చరణ్‌రాజ్, సర్పంచ్ శివలంక లక్ష్మి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రెండో రోజు కేంద్ర బలగాల కవాతు



కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న సీఐ రమణ తదితరులు

సబ్బవరం: సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లంతా తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని సీఐ పిన్నంటి రమణ కోరారు. కేంద్ర పారా మిలటరీ దళాలతో ఫ్లాగ్ మార్చ్ రెండో బుధవారం కూడా నిర్వహించారు. అసకపల్లి,గొల్లలపాలెం,వెదుళ్లనరవ తదితర గ్రామాల మీదుగా కవాతు సాగింది.మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ కవాతు నిర్వహించనున్నట్టు సీఐ తెలిపారు.కార్యక్రమంలో ఎస్ఐ ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలను సందర్శించిన ఐబీ బృందం



తానాం గురుకుల పాఠశాలలో ఐబీ బృంద సభ్యులు

పరవాడ: తానాం గ్రామంలోని మహాత్మా జ్యోతి బాపూలే రెసిడెన్షియల్ పాఠశాల, జూనియర్ కళాశాలను ఐబీ బృందం సభ్యులు బుధవారం సందర్శించారు. ఉపాధ్యాయులతో సమావేశమై బోధన విధానం, ఉపాధ్యాయ శిక్షణ, బోధన అనుభవాలపై చర్చించారు. ఆచార్య కేశిరాజ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఐబీ విద్యావిధానం ప్రవేశంపై కలగబోవు ప్రయోజనాలను వివరించారు. కంప్యూటర్ ల్యాబ్, రోబోటిక్ ల్యాబ్‌ను పరిశీలించారు. అకాడమిక్ టాపర్స్‌ను, యోగా నేషనల్ చాంపియన్స్, స్టేట్ ఆర్ట్ కాంపిటీషన్ విజేతలను ప్రశంసించారు. కార్యక్రమంలో ఐబీ సీనియర్ కరికులమ్ డిజైన్ మేనేజర్ మిస్టర్ ఆల్బో, ఐబీ అసోసియేట్ మేనేజర్ మిస్టర్ మైఖేల్, ఎంఈవో ఎం.దివాకర్, ప్రిన్సిపాల్ ఎం.అప్పలనాయుడు పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణకు పోరాటాలే శరణ్యం



సమావేశంలో ప్రసంగిస్తున్న విమల

గాజువాక : ఉద్యమాల ద్వారా మహిళా హక్కులను పరిరక్షించుకుందామని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తగాజువాక జంక్షన్‌లో బుధవారం తమ సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో నిత్యం ఏదో ఒక చోట మహిళలపై అఘాయిత్యాలు, దాడులు, హత్యలు జరుగుతున్నాయన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులను నియంత్రించడంలో పాలక పక్షాలు విఫలమయ్యాయన్నారు. కె.వనజాక్షి, పిల్లా సూర్యపద్మ, ఎస్.కుమారి, అప్పారి శ్రీలక్ష్మి, సుగుణ, పి.గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

శివాలయాలు ముస్తాబు

- శివరాత్రి పూజలకు ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు
- ముత్యాలమ్మపాలెం తీరంలో పోలీసు బందోబస్తు

పరవాడ/సబ్బవరం: మహాశివరాత్రి పర్వదినానికి శైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. భక్తుల కోసం ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బారికేడ్లు, తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని పరవాడలోని మల్లికార్జునస్వామి ఆలయాన్ని, సబ్బవరం మండలంలోని పెద యాతపాలెం, దేవీపురం, లింగాలతిరుగుడు ఆలయాలను విద్యుత్ తోరణాలతో ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. షామియనాలు, తాగునీరు, ఉచిత ప్రసాద ఏర్పాట్లను చేశారు. తాడిలో పురాతన ఉమా నీలకంఠేశ్వరస్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయంలో రుద్రాభిషేకాలు, లక్షపత్రి పూజలు, లక్షకుంకుమార్చనలు, కుంకుమ పూజలకు ఏర్పాట్లు చేశారు. భర్నికం, దీపాంజలినగర్, ముత్యాలమ్మపాలెం, నాయుడుపాలెం, లేమర్తి గ్రామాల్లోని శివాలయాలకు మహాశివరాత్రికి భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. ముత్యాలమ్మపాలెం సముద్ర తీరంలో పుణ్యస్నానాలు ఆచరించి తీరంలో కొలువుదీరిన రామలింగేశ్వరస్వామిని దర్శించుకొని ప్రసాదాలను స్వీకరిస్తారు. పవావాడ సీఐ ఎస్.బాలసూర్యారావు శుక్రవారం వేకువ జాము నుంచి భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ముత్యాలమ్మపాలెం సచివాలయ కన్వీనర్ బొంది అచ్చిబాబు ఆధ్వర్యంలో భక్తుల కోసం భారీ ఏర్పాట్లు చేశారు.



తాడి ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయం



పెదయాతపాలెం దండి కోనేరులో ద్వాదశ జ్యోతిర్లింగ సహిత గౌరీ పరమేశ్వరులు



వంగలిలోని స్వామి మూల విరాట్



తాడి శివాలయంలో కొలువుదీరిన ఉమానీలకంఠేశ్వరస్వామి



దేవీపురంలోని రాజరాజేశ్వరీదేవి క్షేత్రం



లింగాలతిరుగుడులోని స్వయంభూ సోమలింగేశ్వరస్వామి ఆలయం

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు

- పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- 93,98 వార్డుల్లో రూ.1.13కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



పద్మావతినగర్‌లో వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: ప్రజా సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. జీవీఎంసీ 93, 98వ వార్డుల్లో కోటి 13 లక్షల 88వేల రూపాయలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు బుధవారం ఎమ్మెల్యే అదీప్‌రాజ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేయడం జరిగిందన్నారు. దానిలో భాగంగానే పెందుర్తి నియోజకర్గంలో అర్బన్, రూరల్ అని తేడా లేకుండా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. పద్మావతినగర్‌లో వాకింగ్ ట్రాక్ 15 రోజుల్లో అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

98వ వార్డులో చేపట్టనున్న అభివృద్ధి పనులు

- పద్మావతినగర్ లైన్-4లో రూ.19.90 లక్షలతో కొండ చుట్టూ వాకింగ్ ట్రాక్, వ్యాయామశాల నిర్మాణం.
- లైన్-5లో రూ.28.92 లక్షలతో సీసీరోడ్లు, డ్రైన్లు
- భరత్‌నగర్‌లోని గోపీజనవల్లభస్వామి ఆలయం వద్ద రూ.19.95లక్షలతో రిటైనింగ్ వాల్, అదే ప్రాంతంలో గెడ్డ వద్ద రూ.8.40 లక్షలతో రిటైనింగ్ వాల్ ఏర్పాటు.
- పంచాయతీ కాలనీలో రూ.4.88లక్షలతో రోడ్డు, అప్పన్నపాలెంలో రూ.3 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించనున్నారు.

కార్యక్రమంలో జీవీఎంసీ జోన్-8 కమిషనర్ హేమవతి, 98వవార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఎర్ర వరహానరసింహం, నాయకులు పీతల అప్పలరాజు, నడింపల్లి రామరాజు, పీతల విష్ణుమూర్తి, కె.సింహాద్రి, పద్మావతినగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల చంద్రమౌళీశ్వరరావు, కార్యదర్శి సత్తిబాబు, కాలనీ ప్రతినిధులు రవికుమార్, వెంకటేశ్వరరావు, నారాయణరావు, జగన్నాథం పాల్గొన్నారు.

93వ వార్డులో...

- బాలాజీగార్డెన్స్‌లోని వరలక్ష్మి రెసిడెన్సీ వద్ద రూ.9.23 లక్షలతో, విజయసాయి అపార్ట్‌మెంట్ వద్ద రూ.9.60 లక్షలతో కాంపౌండ్ వాల్ పనులకు, మరో రూ.10 లక్షలతో చేపట్టనున్న పనులకు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ శంకుస్థాపన చేశారు.

కార్యక్రమంలో 93వ వార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నా, 93వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దాసరి అన్నపూర్ణ, పార్టీ నాయకులు దాసరి సత్తిబాబు, వినోద్, నిర్మల, బి.అప్పలరాజు, 94వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఆదిరెడ్డి మురళి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వైద్యానికి సీఎం జగన్ పెద్దపీట

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



మొగలిపురంలో వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, తదితరులు

సబ్బవరం: ప్రజారోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. ఓ వైపు ఆరోగ్య శ్రీ పరిధి పెంచడంతో పాటు సచివాలయాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి ప్రజల ముంగిటకే వైద్యం అందుబాటులోకి తెచ్చారన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో నిర్మించిన ప్రభుత్వ భవనాలను బుధవారం ఆయన ప్రారంభించి అందుబాటులోకి తీసుకువచ్చారు.

- మొగలిపురం సచివాలయం పరిధిలో రూ.20.80 లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్‌ను, ఆదిరెడ్డిపాలెంలో రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.

మొగలిపురంలో ఆయన మాట్లాడుతూ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటుతో మండల కేంద్రాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లే ఇబ్బందులు తప్పుతాయన్నారు. వెల్ నెస్ సెంటర్లలో 105 వ్యాధులకు సంబంధించిన మందులను ఉచితంగా అందజేస్తారన్నారు. తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో బాధపడేవారికి వైద్యుల సిఫార్సుతో ఆరోగ్య శ్రీ ద్వారా రూ.25 లక్షల వరకూ ఉచితంగా వైద్యం అందజేయనున్నట్టు తెలిపారు.

వారికి బుద్ధి చెప్పండి

సంక్షేమం తప్పా అభివృద్ధి చేయలేదని విమర్శిస్తున్న ప్రతి పక్షాలు గత 10 సంవత్సరాల్లో వారి చేసిన అభివృద్ధి,తమ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలన్నారు.తమకు మంచి జరిగితే వచ్చే ఎన్నికల్లో ఓటు వేయాలని అడిగే దమ్మున్న నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు.

ప్రతిపక్షాలకు ఓటు ద్వారా బుద్ధి చెప్పి మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, మాజీ జెడ్పీటీసీ కొటాన రాము, పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బయిలపూడి భగవాన్ జయరాం, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షులు కాపుశెట్టి శేషుబాబు, నాయకులు యడ్ల నాయుడు,ఐడీ బాబు, బైలపూడి దేముడు, బోకం రాము నాయుడు,సబ్బవరపు నారాయణమూర్తి,యర్రా శ్రీనివాసరావు,వడ్డాది అప్పలరాజు,బోను గంగునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెదగాడిలో శివాలయం నిర్మాణానికే స్థల సేకరణ

- దానిపై జనసేన-టీడీపీ నాయకుల తప్పుడు ప్రచారం
- ఖండించిన సర్పంచ్ లావణ్య



జనసేన-టీడీపీ ఆరోపణలను ఖండిస్తున్న సర్పంచ్ లావణ్య, పెదగాడి గ్రామ పెద్దలు

పెందుర్తి: మండలంలోని పెదగాడి గ్రామంలో చెరువు కబ్జా అవుతుందని టీడీపీ-జనసేన నాయకులు చేస్తున్న ఆరోపణలను సర్పంచ్ కేసుబోయిన లావణ్య త్రినాథ్ తిప్పికొట్టారు. రాజకీయాల కోసం గ్రామం పరువు తీస్తున్నారని వారిపై మండిపడ్డారు. బుధవారం గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. గ్రామంలోని సర్వే నెంబర్ 70 కోనేరు స్థలంలో శివాలయం నిర్మాణానికి పెద్దలంతా కలిసి కొంత స్థలం చదును చేయించామన్నారు. అయితే గ్రామంలోని జనసేన నాయకులు దీన్ని తప్పుదోవ పట్టించేందుకు తమపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. నిరుపేదలకు ప్రభుత్వం ద్వారా ఇంటి స్థలాలు కేటాయిస్తున్నా వాటికి కూడా అడ్డుపడుతున్నారని ఆరోపించారు. తన భర్త, వైఎస్సార్‌సీపీ నేత త్రినాథ్ గ్రామంలో గజం స్థలం ఆక్రమించినట్లు నిరూపిస్తే తక్షణమే తన పదవికి రాజీనామా చేస్తానని..లేకపోతే ప్రతిపక్ష నాయకులు బహిరంగ క్షమాపణ చెబుతారా అని సవాల్ విసిరారు.

పదోతరగతి ప్రశ్నపత్రాలు వచ్చేశాయ్



పరీక్షా పత్రాలను సరిచూసుకుంటున్న ప్రధానోపాధ్యాయులు

సబ్బవరం: ఈ నెల 18వ తేదీ నుంచి జరగనున్న పదోతరగతి పరీక్షలకు సంబంధించిన ప్రశ్న పత్రాలు సబ్బవరం పోలీస్ స్టేషన్‌కు బుధవారం చేరుకున్నాయి. ఎంఈవో బీఎస్ఎన్ మూర్తి, డిపార్టుమెంట్ అధికారులు,చీఫ్ సూపరింటెండెంట్‌లు ప్రశ్న పత్రాల బాక్స్‌లను సరిచూసుకొని పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచారు. ఎంఈవో మాట్లాడుతూ సబ్బవరం మండలంలో 5 పదోతరగతి పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటిలో సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సన్‌రిడ్జ్ స్కూల్, ప్రతిభా విద్యాలయం,మదర్ పబ్లిక్ స్కూల్, రావలమ్మపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఈ పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

ఘోషాస్పత్రి ఏవోగా నారాయణరావు

మహారాణిపేట : ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి (ఘోష) పరిపాలనాధికారిగా నారాయణరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పరిపాలనాధికారిగా పని చేసిన సన్యాసినాయుడు పదవీ విరమణ చేశారు. ఖాళీగా ఉన్న ఆ పోస్టులో డీఎంహెచ్‌వో కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న నారాయణరావును పదోన్నతిపై విక్టోరియా ఆస్పత్రి ఏవోగా నియమించారు.

వేపగుంట-పినగాడి రహదారికి మహర్దశ



పునర్నిర్మాణం కానున్న వేపగుంట-పినగాడి రహదారి



మేయర్ హరివెంకటకుమారికి కృతజ్ఞతలు తెలుపుతున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

- రోడ్డు పునర్నిర్మాణానికి రూ.1.47 కోట్లు విడుదల
- ఫలించిన 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన కృషి
- త్వరలో పనుల ప్రారంభానికి సన్నాహాలు


పెందుర్తి: వేపగుంట-చీమలాపల్లి-పినగాడి రోడ్డుకు మంచిరోజులు వచ్చాయి. ఈ రహదారి పునర్నిర్మాణానికి జీవీఎంసీ భారీగా నిధులు మంజూరు చేసింది.

జీవీఎంసీ పరిధిలో ఉన్న వేపగుంట-లక్ష్మీపురం వంతెన వరకు రోడ్డు పునర్నిర్మించడానికి రూ.1.47 కోట్లు విడుదల చేసింది. పనులను జీవీఎంసీ యంత్రాంగం అతి త్వరలో ప్రారంభించనుంది.

ఫలించిన కార్పొరేటర్ ముమ్మన కృషి

వాస్తవానికి వేపగుంట-పినగాడి రహదారి నిర్మాణానికి ప్రభుత్వం కొన్నాళ్ల కిందట నిధులు విడుదల చేసింది. అయితే కొన్ని స్థానిక కారణాల వల్ల రోడ్డు పనులు వాయిదా పడుతూ వస్తున్నాయి. ఈ క్రమంలో రోడ్డు మరింత ధ్వంసం అయింది. దీంతో వాహనదారుల ఇబ్బందులను గుర్తించిన కార్పొరేటర్ ముమ్మన దేముడు ఈ రోడ్డు మరమ్మతుల కోసం నిధులు విడుదల చేయాలని మేయర్ గొలగాని హరివెంకటకుమారి, కమిషనర్ సాయికాంత్‌వర్మకు విన్నవిస్తున్నారు.దీంతో నిధులు విడుదల చేశారు. పనులు ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. రోడ్డు నిర్మాణానికి నిధులు విడుదల చేసిన మేయర్ హరివెంకటకుమారి, కమిషనర్ సాయికాంత్‌వర్మకు కార్పొరేటర్ ముమ్మన దేముడు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

అప్పన్నకు వైభవంగా ఏకాదశి ఆర్జిత సేవలు



స్వర్ణ తులసీ దళాలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ తులసీ దళార్చన వైభవంగా నిర్వహించారు. 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ఏఈవో భ్రమరాంబ, సూపరింటెండెంట్ వెంకటరమణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదగండి

ఏయూ క్యాంపస్: యువతరం ఆశయం దిశగా అడుగులు వేయాలని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి అన్నారు. బుధవారం ఉదయం ఏయూ టీఎల్ఎన్ సభా మందిరంలో నిర్వహించిన జియో ఫిజిక్స్ విభాగం వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. విశ్వవిద్యాలయంలో ప్రతి విద్యార్థి ప్రతిభావంతుడేనన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా యువతరం ఎదగాలని పిలుపునిచ్చారు. ఏయూలో స్టార్టప్ ఇంక్యుబేషన్ వ్యవస్థలను అభివృద్ధి చేశామని, వీటిలో 152 సంస్థలు పనిచేస్తూ 7 వేల మందికిపైగా ఉపాధి కల్పించాయన్నారు. విభాగాధిపతి ఆచార్య సి.వి.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్,వారపు సంతలో ఆశీలు వసూలుకు వేలం



వేలం పాట నిర్వహిస్తున్న పంచాయతీ పాలకవర్గ సభ్యులు

సబ్బవరం: సబ్బవరంలోని వారపు సంతతో పాటు డైలీ మార్కెట్‌లో ఆశీలు వసూలు చేసుకునేందుకు మేజర్ పంచాయతీ పాలకవర్గ సభ్యులు బుధవారం వేలం పాట నిర్వహించారు. పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు ఆధ్వర్యంలో ఈవోఆర్‌డీ మహేష్ తదితరులు ఏడాది పాటు ఆశీలు వసూలుకు ఈ వేలం పాట నిర్వహించారు. రోజువారి సంత పాట రూ.2,10,000కు ఖరారైంది.గత సంవత్సరం రూ.2,01,000కు వెళ్లగా ఈ సంవత్సరం రూ.9 వేలు అదనంగా పంచాయతీకి ఆదాయం సమకూరింది. అలాగే వారపు సంత ఆదివారం,గురువారాలకు నిర్వహించిన వేలం పాట రూ.3,38,000కు వెళ్లింది. పంచాయతీ కార్యదర్శి మూర్తిబాబు, పాలకవర్గ సభ్యులు,గ్రామ పెద్దలు గొర్లి శ్రీను,టి.శేఖర్,బాదిరెడ్డి లక్ష్మణ,పల్లా తాతారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు యువ ఉద్యోగుల 'తాలి బజావో'

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యువ ఉద్యోగులు వేతన సవరణపై మరోసారి గళం ఎత్తుతున్నారు. ఇందు కోసం తాలి బజావో కార్యక్రమానికి రూపకల్పన చేశారు. ఉక్కు కార్మికులకు 2017 జనవరి 1 నుంచి వేతన సవరణ జరగలేదు. దీంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న యువ ఉద్యోగులు గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ఈ కార్యక్రమం చేపట్టనున్నారు. ఉక్కు ఎల్‌డీసీ విభాగం నుంచి ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ వరకు ఈ కార్యక్రమం చేపట్టనున్నట్లు వారు ప్రకటించారు.